# మూలుగు

అనువాదకథ


కన్నడ మూలం: కువెంపు

అనువాదం

గోవిందరాజు రామకృష్ణారావు

**అది నందనవనం. కల్పవృక్షానికి దగ్గర్లో మామూలు చెట్టొకటుంది. దాని నీడలో విశ్వామిత్రుడు అటు యిటు తిరుగుతున్నాడు. ఇంద్రియ నిగ్రహం వున్నవాడు. అనుకున్న కోరికను తక్షణం తీర్చే కల్పవృక్ష చేరువలో వుంటే ఏం జరుగుతుందో ఆయనకు తెలుసు. మంచివైనా, చెడ్డవైనా ఆలోచనలన్నీ సాకారమైతే ఇంకేమన్నా వుందా! రాజర్షి దశ నుంచి బ్రహ్మర్షి స్థాయికి ఎదిగినవాడు. అయినా తన మనస్సు స్ఫటికం లాంటిదని గట్టిగా నమ్మలేకపోతున్నాడు.**

మనస్సులో ఏదో మెదిలింది. కలత చెందాడు. ఒకసారి దేవతలు కామమోహితులై కేళీ విలాసాలలో మైమరచి పెద్దగా నవ్వసాగారు. విశ్వామిత్రుడు తలెత్తి అటు చూశాడు. సుగంధాలు వెదజల్లే లతలు గాలికి తలలూపుతున్నాయి. ఇంద్రాదులు రంభ, ఊర్వశి, తిలోత్తమ, ఘృతాచి, మేనక మొదలైన అప్సరసలతో చేతులు కలిపి నృత్య గానాలతో వినోదిస్తున్నారు. అనేక ఇంద్రధనుస్సుల మండల క్రీడగా తోచింది. అది గమనించిన విశ్వామిత్రుడికి ఆగ్రహం కలిగింది. తనను ముల్లోకాలలో అవహేళనపాలు జేసిన మేనక వారితో వుండడం అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. విశ్వామిత్రుడు శపించలేదు. మత్తెక్కిన దేవతల ధోరణి సభ్యశూన్యంగా వుంది. ఏవగించుకుని ఆ రుషీశ్వరుడు తల దించుకుని మళ్ళీ అటూ యిటూ తిరగసాగాడు.



"ఛీ... ఛీ!! ఇది స్వర్గమా! మద్యశాలకంటె హీనంగా తయారయింది. దీనికన్నా నరకమే నయం. బాధల్లో కూడా అక్కడ హుందాతనం చోటు చేసుకుంటుంది. కాని ఇక్కడ తాండవించే వెకిలితనానికి అంతులేదు. ఇక్కడ తినడం, తాగి తుందనాలాడడం. దానవులతో యుద్ధం. వాళ్ళ చేతుల్లో చిత్తుగా ఓడిపోవడం. గతిలేక పరుగులు తీసి త్రిమూర్తుల్ని ఆశ్రయించడం. ఇవీ వీళ్ళ 'ఘనకార్యాలు'. అమరుల వ్యవహారానికి ముగింపేది?" ఈ ఆలోచనలు విశ్వామిత్రుడి మనస్సును కలవరపరిచాయి. చేసేది లేక జాలి పడ్డాడు.

అప్పుడు నృత్య గానాలతో దేవతలు, అప్సరసలు చేసే రణగొణధ్వనుల్ని ఛేదిస్తూ, నందనవనం ఉపరితలాన్ని చీల్చుకుని పైకి ఎగసివచ్చిన అత్యంత హృదయవిదారకమైన సుదీర్ఘ ఆర్తనాదం విశ్వామిత్రుడి చెవులకు సోకింది. అది విపరీతమైన బాధతో నిండిన మూలుగు.

పిడుగు పడినట్లయింది. విశ్వామిత్రుడు విచలితుడయ్యాడు. శరీరమంతా కంపించిపోయింది. "మళ్ళీ అదే మూలుగు!" దిగ్భ్రాంతితో అతని నోటివెంట మాటలు వెలువడ్డాయి. పెద్దగా నిట్టూర్చాడు.

వినోదాలతో తన్మయులైన దేవతలకీ మూలుగు కొంచెమైనా వినిపించలేదు. మద్యసేవనం నిరాటంకంగా సాగిపోతోంది.

చాలారోజుల నుంచి విశ్వామిత్రుణ్ని ఈ మూలుగు వెంటాడుతోంది. ఎక్కడున్నా, ఎప్పుడైనా, ఏం చేస్తున్నా హఠాత్తుగా ఈ ధ్వని అతని చెవుల్ని బద్దలు చేస్తోంది. విశ్వామిత్రుడు నిస్సందేహంగా స్థితప్రజ్ఞుడే. అయినా కలవరానికి లోనవుతున్నాడు. కైలాసానికి వెళ్ళాడు. అక్కడ వినిపించింది. అలాగే వైకుంఠంలో, సత్యలోకంలో కూడా వదలలేదు. నరకానికి వెళ్ళాడు. అక్కడున్న శోకాలు, రోదనలు మించి అంతుపట్టని ఈ ఆర్తనాదం అతని కర్ణపుటాలను ఛేదించింది.

ఈ మూలుగు ఎక్కణ్నుంచి వస్తోందో తెలుసుకునేందుకు విశ్వామిత్రుడు తీవ్రంగా యత్నిస్తున్నాడు. కాని ఫలితం కనుపించడం లేదు. వైకుంఠానికి వెళ్ళినప్పుడు వసిష్ఠుణ్ని అడిగాడు. అలాంటి మూలుగు గురించి తానెప్పుడూ వినలేదని చెప్పాడు. ఒకవేళ అది విశ్వామిత్రుడి భ్రమ కావచ్చుననే సందేహం వెలిబుచ్చాడు. అరిష్ట నివారణకు యజ్ఞం చేయడం మంచిదని సూచించాడు. అలాంటి కర్మకాండల మీద నమ్మకం వదులుకున్న విశ్వామిత్రుడు ఆ సూచనను పాటించలేదు.

ఇలా ఆలోచిస్తూ విశ్వామిత్రుడు తలెత్తి చూశాడు. పరశురాముడు తనవైపు వస్తున్నాడు. అతని ముఖం కూడా కాంతిహీనంగా వుంది.

విశ్వామిత్రుని కుడి భుజంపైన చేయి వేసి 'కౌశికా! నువ్వు మూలుగు లాంటి ధ్వని ఏదైనా విన్నావా?' అని అడిగాడు.

తాను మూలుగు ధ్వనితో వ్యాకులం చెందుతున్న స్థితి అంతా వివరించాడు. పరశురాముడు తనను కూడా ఆ మూలుగు వెన్నాడుతున్న సంగతి చెప్పాడు. గుండెలు బద్దలు చేసే ఆ మూలుగు ఎక్కడ నుంచి వస్తోందో తెలుసుకునేందుకు ముల్లోకాలు తిరుగుతున్నానని వెల్లడించాడు.

వాళ్ళలా సంభాషించుకుంటున్నారు.



భూలోకం సమీపిస్తోంది. ఇద్దరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. వాళ్ళిది వరకు చూసిన భూలోకానికీ, ఇప్పటి భూలోకానికీ పోలికలే లేవు. ఒక పక్క నాగరికత, సంస్కృతి పెరిగాయి. ఈ రెండింటిని ఒక్క క్షణంలో ధ్వంసం చేయగల అనాగరికత, విష సంస్కృతి వర్ధిల్లుతున్నాయి. మనిషి ప్రాణాలను కాపాడే వైద్య విజ్ఞానం అభివృద్ధి చెందింది. దానితోపాటు ప్రాణాంతక వ్యాధుల్ని తెచ్చిపెట్టే చెడు అలవాట్లు మితిమీరుతున్నాయి.

ఇంతలో దేవతలు, అప్సరసలు కలిసి చేస్తున్న విందు వినోదాల శబ్దాలను మింగివేస్తూ గుండెలవిసే ఆ మూలుగు ఇద్దరికీ వినిపించింది. ఆపాదమస్తకం కంపించిపోయారు. ఒక మనిషిని వాడిగా వుండే ముళ్ళపైన పడుకోపెట్టి, అతనిమీద పెద్ద రాయి వుంచి, దానిని చాలా బరువైన సమ్మెటలతో పదే పదే బాదుతుంటే ఆ మనిషి బాధతో పెట్టే అరుపులకన్నా తీవ్రంగా వుందా మూలుగు.

కొంతసేపటికి వాళ్ళ కాళ్ళ వణుకు తగ్గింది. అప్పుడు హరినామ గానం చేస్తూ వైకుంఠానికి వెళ్తూ నారదుడు అక్కడికి వచ్చాడు. విశ్వామిత్రుడు, పరశురాముడు గబగబా త్రిలోక సంచారి దగ్గరికి వెళ్ళి తమకు వినిపిస్తున్న ఆ మూలుగు గురించి అడిగారు. నారదుడి ముఖకవళికల్లో మార్పు కనిపించింది. 'నిజమే! చాలా కాలంగా ఆ మూలుగు నా చెవులకూ వినిపిస్తోంది. విన్నప్పుడల్లా గుండెను పిండేసినట్లవుతోంది. మూలుగుకు కారణం తెలియడం లేదు. కాని అది భూలోకంనుంచే వస్తోందని నా నమ్మకం' అని చెప్పి దేవర్షి హరిగానం చేస్తూ వెళ్ళిపోయాడు. రుషిపుంగవులిద్దరూ భూలోకానికి పయనమయ్యారు.

భూలోకం సమీపిస్తోంది. ఇద్దరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. వాళ్ళిదివరకు చూసిన భూలోకానికీ, ఇప్పటి భూలోకానికీ పోలికలే లేవు. ఒక పక్క నాగరికత, సంస్కృతి పెరిగాయి. ఈ రెండింటిని ఒక్క క్షణంలో ధ్వంసం చేయగల అనాగరికత, విష సంస్కృతి వర్ధిల్లుతున్నాయి. మనిషి ప్రాణాలను కాపాడే వైద్య విజ్ఞానం అభివృద్ధి చెందింది. దానితోపాటు ప్రాణాంతక వ్యాధుల్ని తెచ్చిపెట్టే చెడు అలవాట్లు మితిమీరుతున్నాయి. అలాగే అపార సంపద, అత్యంత దారిద్ర్యం పక్కపక్కనే వున్నాయి. రైళ్ళు, మోటారుకార్లు, విమానాలు, విద్యుచ్ఛక్తి, తుపాకులు, బాంబులు, ముద్రణాలయాలు ఎన్నో మరెన్నో ఇంకెన్నెన్నో వాళ్ళకి కనుపించాయి. కొన్ని నచ్చాయి కొన్ని నచ్చలేదు. వేషం మార్చి ఆధునికుల్లా తయారై ఒక పెద్ద నగరంలో దిగారు. పరుగులు పెట్టే వాహనాలు, ఉరకలతో పాదచారులు, కిటకిటలాడే అంగళ్ళు, ఖాళీ లేని హోటళ్ళు, జనం బారులు తీరిన తంతి తపాలా కార్యాలయాలు, వింత వింత వ్యాపార ప్రకటనలు, మద్యనిషేధ కార్యాలయం పక్కనే మద్యం దుకాణం, పోలీసుస్టేషను పక్క భవనం మొదటి అంతస్తులో జూదగాళ్ళ కోలాహలం, 'ఇచ్చట గలీజు చేయకూడదు' అని రాసి వున్నచోట దుర్గంధం, సినిమా హాలు, నాటకశాల, కర్మాగారం, పాఠశాల వగైరా వగైరా చూసుకుంటూ విస్మయం చెందుతూ మూలుగు పుట్టిన ఇంటికోసం వెతుకుతున్నారు.

దారిలో గుడి కనుపించింది. భక్తుల దగ్గర అర్చకుడు డబ్బు గుంజడం గమనించి నవ్వుకున్నారు.

'చూశావా పరశురామా! ఈ అర్చకుల వ్యవహారం'

'నిజమే విశ్వామిత్రా! ఏం చేస్తారు? ఆ రోజుల్లో రాజులు పోషిస్తే ఈ రోజుల్లో రాజ్యమేలే ప్రజలే పోషిస్తారు వీళ్ళని?'

ముందుకు సాగారు.

ఒకచోట జనం గుమిగూడితె ఆగి చూశారు. ఒక హరిదాసు హరికథ చెబుతున్నాడు. దేవుని కృప గురించి రసభరితంగా చెబుతున్నాడు. శ్రోతలు కన్నీరు పెట్టుకున్నారు. ఇద్దరూ వింటున్నారు. దాసు తపస్సు ఎంత గొప్పదో వివరిస్తూ విశ్వామిత్ర, పరశురాముల కథ తన్మయత్వంతో చెబుతున్నాడు. అవి తమకు తెలియని కొత్త సంగతులు కావడంతో కళ్ళప్పగించి చూస్తున్నారు.

'విశ్వామిత్రా! ఆ దాసు చెప్పే కథలోని విశ్వామిత్రుడెవరు?'

'ఆయన చెప్పే పరశురాముడు, విశ్వామిత్రుడు మనం కాదులే! అదో పుక్కిటి పురాణం!!'

అక్కణ్నుంచి కదిలారు.

మరోచోట ప్రవేశద్వారం దగ్గర రంగు రంగుల దుస్తుల్లో ఇద్దరు చెరొకవైపు నిలబడ్డారు. టోపీ, బూటు, కోట్లు ధరించి చాలామంది లోపలికెళ్తున్నారు. అదే వేషధారణతో వారిద్దరూ అక్కడికి వెళ్ళారు. అంతా ఆసీనులయ్యారు. వేదికపైకి నర్తకి వచ్చి వింతగా గెంతడం మొదలుపెట్టింది. అది నృత్యం కాబోలనుకున్నారు. చూడలేక బయటికి నడిచారు.

ఎక్కడికి వెళ్ళినా, ఎవర్ని అడిగినా మూలుగు గురించి ఏమీ చెప్పలేకపోతున్నారు. అసలు ఎవ్వరూ ఆ మూలుగు విన్నట్టు లేదు. నగరంలోని గజిబిజి వాతావరణం మధ్య వారు తాము భూలోకానికి వచ్చిన పని మరిచిపోయేట్టున్నారు.

నగరమంతా గాలించి గాలించి అలిసిపోయి లాభం లేదనుకుని బయటపడ్డారు. చెవులు చిల్లులు పడే రకరకాల ధ్వనుల నుంచి దూరంగా వెళ్ళాక ఆ భయంకరమైన మూలుగు మళ్ళీ వినిపించింది. నగరం నుంచి దూరం ఎక్కువవుతున్నకొద్దీ మూలుగు శబ్దం పెరుగుతూ వచ్చింది. మూలుగుకు మూలమైన చోటు దగ్గర పడుతోందా అని తోచింది వారికి. దారిలో ఒక అడవి వచ్చింది. అది దట్టంగా వుంది. మానవ నివాసాలేవీ లేవు. కొండమీద కూడ దట్టమైన అడవి వుంది. శిఖరం చేరుకున్నారు. దిగువ లోయలోంచి మూలుగు వస్తున్నట్లు తెలుసుకున్నారు. ఒకరి చేయి ఒకరు పట్టుకుని నెమ్మదిగా కొండ దిగారు.

దగ్గర్లో వరి పొలం కనుపించింది. పొలం ఒక మూలలో పూరిగుడిసె వుంది. అదే...

ఆ గుడిసెలోంచి మూలుగు బయలుదేరి విశ్వమంతా వ్యాపించింది. సత్యలోకం, కైలాసం, వైకుంఠం చేరింది. సగటు మనుష్యుల రూపంలో గుడిసె దగ్గరికి వెళ్ళారు.

గుడిసె బయట మనుష్యులెవరూ లేరు. బక్కచిక్కిన కుక్క మట్టిలో దొర్లుతూ వారిని చూసి ఒకటి రెండుసార్లు కుంటుకుంటుమని ఓపిక లేక పడుకుండిపోయింది. కోడిపెట్ట మట్టిని ముక్కుతో పొడుస్తూ కనుపించింది. ఆ కొండ, పైన దట్టంగా వున్న అడవి భయం గొల్పుతున్నాయి. అంతా నిశ్శబ్ద వాతావరణం. దానిమధ్య గుడిసెలోంచి లోకాలు దద్దరిల్లే మూలుగు.

గుడిసెగోడలు చువ్వలతో కట్టినవి. దానికి అక్కడక్కడా రంధ్రాలున్నాయి. ముందు విశ్వామిత్రుడు అందులోంచి లోపలికి చూసి, పరశురాముణ్ని కూడా చూడమని చెప్పాడు.

గుడిసెలో మసక వెలుతురు. ఎక్కడ చూసినా దుమ్ము, మసి, పలుగు, పార, పెద్దబుట్ట, తట్ట, కుండ, కొడవలి, నాగలి ఇంకా కొన్ని సాగు పనిముట్లు చిందరవందరగా పడివున్నాయి. చెత్తా చెదారం. ఈగలు ముసురుతున్నాయి. గుడిసె మధ్యలో పాత కంబళి పరిచివుంది. దానిమీద ఒక రైతు వెల్లకిలా పడుకున్నాడు. నడుం చుట్టూ మురికిధోవతి తప్ప ఒంటిపై ఇంకేమీ బట్టలు లేవు. రెండు చేతుల్తో ఛాతీ నొక్కుకుంటూ భయంకరంగా మూలుగుతున్నాడు. ఆ నరకయాతన తట్టుకోలేక చిక్కి శల్యమైన అతని నల్లటి శరీరం బండరాయి కింద చిక్కుకుపోయిన పాములాగా మెలికలు తిరుగుతోంది. అలా చూస్తుండగానే రైతు రక్తం కక్కుకుంటున్నాడు. ముద్దలుగా పడిన రక్తంతో నేల ఎర్రగా మారింది. రైతు పక్కన అతని భార్య కూర్చుంది. మురికి పట్టిన చీర కట్టుకుంది. అన్నీ చిరుగులే. మనిషి చాలా పీలగావుంది. నెత్తిన చేతులు పెట్టుకుని కన్నీరు పెట్టుకుంటోంది. ఆమె వెనక అయిదేళ్ళ కూతురు మొండిమొలతో వుంది. చింపిరి జుట్టు, కడుపు లోతుకు పోయింది. అపస్మారకంలో వున్నట్టు నేల మీద పడుకుండిపోయింది.

రుషుల గుండెలు కరిగి, కన్నీరు ధారలు కట్టింది. నగరంలో తాము చూసిన వికృత దృశ్యాలు తలుచుకున్నప్పుడు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వెంటనే తడిక తలుపు తోసుకుని, తల గీసుకోకుండా వంగి గుడిసె లోపలికి వెళ్ళారు.

సాదా మనుష్యులుగానే వున్నా రైతు భార్య వాళ్ళిద్దర్నీ చూడగానే ఏడ్చినంత పని చేసి, చేతులెత్తి దండంపెట్టి 'అయ్యా! మీ కాళ్ళు మొక్కుతా. ఇప్పుడు మా దగ్గర చిల్లి గవ్వ లేదు. మా మామ కోలుకోగానే బాకీ తీర్చేస్తాం. ఎక్కడైనా తల తాకట్టు పెట్టి తెస్తాం. మా బిడ్డను చూసైనా మా మీద దయ చూపండి స్వామి' అని వేడుకుంది.



సాదా మనుష్యులుగానే వున్నా రైతు భార్య వాళ్ళిద్దర్నీ చూడగానే ఏడ్చినంత పనిచేసి, చేతులెత్తి దండంపెట్టి 'అయ్యా! మీ కాళ్ళు మొక్కుతా. ఇప్పుడు మా దగ్గర చిల్లి గవ్వ లేదు. మా మామ కోలుకోగానే బాకీ తీర్చేస్తాం. ఎక్కడైనా తల తాకట్టు పెట్టి తెస్తాం. మా బిడ్డను చూసైనా మా మీద దయ చూపండి స్వామి' అని వేడుకుంది.

పెద్ద పెట్టున రోదించింది.

ఆమెను సముదాయించి శిస్తు వసూలు చేసే ప్రభుత్వోద్యోగులం కామని చెప్పారు. కాబూలివాళ్ళమో, అప్పులు రాబట్టేందుకు షావుకారు పంపిన గుండాలమో కాదని, దూర ప్రాంతం నుంచి వచ్చిన బాటసారులమని నచ్చచెప్పారు. ఆమె వాళ్ళ కాళ్ళపై తమ కష్టాలన్నీ ఏకరువు పెట్టింది.

'ఇంతకూ నీ భర్తకున్న జబ్బేమిటి?'

'దేవుడికే తెలియాలయ్యా!'

'ఎంత కాలం నుంచి బాధపడుతున్నాడు?'

'చాలా కాలం నుంచయ్యా! ఒక్కోసారి తగ్గినా మళ్ళీ తిరగబెడుతుంది. ఏమి జబ్బో ఎవరూ తెలుసుకోలేకపోతున్నారు. ఉన్నట్టుండి గుండెమీద పెద్ద బరువు పడ్డట్టు గిలగిలలాడిపోతాడు. ప్రతి కీలుమీద కరిగించిన ఇనుము పోసినంతగా కొట్టుకుంటాడు. అప్పుడప్పుడూ రక్తం కక్కుకుంటాడు. వైద్యులెందరో చూశారు. జ్యోతిష్కులొచ్చారు. దేవుళ్ళందరికీ మొక్కాను. ఏమీ ప్రయోజనం కనుపించలేదు. దేవుడు కూడా మా మీద చిన్నచూపు చూశాడు'.

'అలా అనుకోవద్దమ్మా! దేవుడు దయామయుడు. మేం చేయగలిగిన సహాయం తప్పక చేస్తాం' అని హామీ యిచ్చారు.

వారిద్దరూ బక్కరైతును పరీక్షించారు. గుండె, ఊపిరితిత్తులు, పేగులు, మెదడు అన్నీ జాగ్రత్తగా పరిశీలించారు. ఎందులోనూ కొంచెమైనా లోపం లేదు. రోగలక్షణాలు కూడా ఎక్కడా లేవు. రైతు సమాధానం చెప్పే స్థితిలో లేడు.

ఛాతీ మీద చేతులు వేయగానే రైతు భయంకరంగా మూలగసాగాడు. ఇద్దరూ గాబరా పడ్డారు. రైతు బాధకు కారణం అంతుపట్టలేదు. అది తెలుసుకోవడం బ్రహ్మవిద్య కన్నా కష్టతరమనిపించింది. దగ్గర్లో వున్న బస్తీకి వెళ్ళి ఒక వైద్యుణ్ని తమ వెంట రావలసిందిగా కోరారు. మోటారు కారు వెళ్ళడానికి వీలు లేని ఆ ప్రాంతానికి రానని ముందు బిగుసుకున్నాడు. బంగారు నాణేలు చేతుల్లో పెట్టారు. మారు మాట్లాడకుండా గంగిరెద్దులా వారి వెంట బయలుదేరాడు.

వైద్యుడు రైతును ఆదరబాదరగా పరీక్షించాడు. ఏమీ అంతుపట్టకపోయినా ఏవో లాటిన్ పదాలతో రోగంపేరు చెప్పి మందేదో యిచ్చి బయటపడ్డాడు. కొంచెమైనా గుణం కనుపించలేదు. రైతుభార్యకు వైద్యులమీద నమ్మకం పోయింది. ఏదో భూతం తన భర్తను పట్టి పీడిస్తోందని గట్టిపూజారి ఏమైనా చేయగలడేమోనని వారికి చెప్పింది.

ముందు విశ్వామిత్రుడు నసిగాడు. అది కూడా ప్రయత్నిద్దామని పరశురాముడనడంతో తలకాయూపాడు. ఒక పూజారిని పిలుచుకొచ్చారు. అతనికీ దిక్కు తోచకపోయినా ఏదో భూతం పేరు చెప్పి గట్టిగా మంత్రాలు వల్లించి, చేతిలో బంగారు నాణేలు పడంగానే పలాయనం చిత్తగించాడు.

'ఈ పురోహిత వర్గం అంతా ఒకటే. సొమ్ము దండుకోవడమే పని. వసిష్ఠుడూ అంతే. అతగాడు రఘువంశానికి శనిలాగా దాపురించాడు. గురుపీఠం నుంచి ఇక్ష్వాకు, రఘు, దిలీపు, దశరథ, రామ ప్రభువులందరి దగ్గరా బాగా గుంజాడు. అందుకే వీళ్ళని పిలవద్దని ముందే చెప్పాగదా!' విశ్వామిత్రుడన్నాడు.

వారు చేసిన ప్రయత్నాలేవీ ఫలించడం లేదు.

ఎవరో ఇద్దరు బాటసారులొచ్చి రైతు గుడిసెలో వుంటున్నారని, బంగారు నాణేలు ఇస్తున్నారనే వార్త ఆ చుట్టుపట్ల పాకింది. జనానికీ, ఉద్యోగులకీ రైతుబాధ గుర్తొచ్చింది. వచ్చి పరామర్శ చేయడం మొదలుపెట్టారు.

ప్రభుత్వ హోదాలో వున్న వైద్యులుగాని, ఆచార్యులుగాని వచ్చినప్పుడు రైతుబాధ ఇంకా ఎక్కువవుతోంది.

కొన్ని రోజులు గడిచాయి. విశ్వామిత్రుడు తీవ్రంగా ఆలోచించసాగాడు. దేవతల వైద్యుడు ధన్వంతరి మనస్సులో మెదిలాడు. ఆ సంగతి పరశురాముడికి చెప్పాడు. ఆలోచన బాగుందని పరశురాముడన్నాడు.

**"మహా ఘోరం! ఈ నిర్భాగ్యజీవి ఈ పేద రైతు తన గుండెపై ఇంత బరువు మోపినా ఇంకా బ్రతికి వుండడం చాలా ఆశ్చర్యంగా వుంది. గోవర్ధన పర్వతాన్ని మోసిన శ్రీకృష్ణుడైనా సరే ఇంత బరువు వేస్తే నుగ్గునుగ్గు కాకమానడు" పరశురాముడు తన అభిప్రాయం ప్రకటించాడు.**

ధన్వంతరిని రప్పించారు. సాధారణ వైద్యుని రూపంలో వచ్చిన ధన్వంతరి రైతు బాధను చూసి గుండెలవిసే మూలుగును విన్నప్పుడు మొదట భయభ్రాంతుడయ్యాడు. ధైర్యం కూడగట్టుకుని రైతును పరీక్షించ సాగాడు.

రైతుభార్యతో పాటు పరశురాముడు, విశ్వామిత్రుడు ఉత్కంఠతో గమనిస్తున్నారు. ఊపిరి బిగపెట్టుకుని మరీ గమనిస్తున్నారు. ధన్వంతరి చాలాసేపు పరీక్షించాడు. ఇద్దరి వైపు అదోలా చూశాడు. అది గమనించిన రైతుభార్య గొల్లుమని విలపించసాగింది. వాస్తవానికి ధన్వంతరి విశ్వామిత్ర పరశురాములతో సంభాషిస్తున్నాడు. అది ఆమెకు తెలియదు. వినిపించదు కూడా.

"ఇది శారీరక రుగ్మత కాదు" ధన్వంతరి వెల్లడించాడు.

"మరి ఆత్మకు సంబంధించిందా?" పరశురాముడి ప్రశ్న.

ధన్వంతరి తల అడ్డంగా తిప్పి 'అది కూడా కాదు' అన్నాడు.

"మరింకేమిటి!" విశ్వామిత్రుడు ఆశ్చర్యంతో అడిగాడు.

ధన్వంతరి వివరించాడు: "ఇది శారీరక రుగ్మతైనట్లయితే ఏదో ఒక భాగంలో కనిపించేది. దేహమంతా జాగ్రత్తగా పరీక్షించాను. ఎక్కడా లోపం లేదు. పోనీ పాపఫలం అనుకుందామా అంటే ఈ రైతు సాధుజీవనం సాగిస్తున్నాడు. ఎలాంటి పాపానికీ పాల్పడలేదూ కాబట్టి ఆ దోషం కూడా లేదు. అందుచేత..."

ఇలా చెబుతూ ధన్వంతరి ఒక దివ్య మంత్రాన్ని బయటికి తీశాడు. కాని అది రైతుభార్యకు కనుపించదు. ధన్వంతరి చెప్పడం కొనసాగించాడు: "ఈ యంత్రంగుండా చూస్తే రైతుబాధకు అసలైన కారణం తెలిసిపోతుంది".

ధన్వంతరి రైతుకు కొంత దూరంలో నిలబడి ఆ దివ్యమంత్రంగుండా చూశాడు. వారిద్దరూ ఉత్సుకతతో చూస్తున్నారు.

ధన్వంతరి ముఖం కందగడ్డలా మారింది. ఊపిరివేగం పెరిగింది. కళ్ళవెంట నీరు కారుతోంది.

"ఓరి పాపాత్ములారా!" ఏనుగు ఘీంకరించినట్లు ధన్వంతరి అరిచాడు. రైతుభార్యకు మాత్రం ఆ శబ్దం నిమ్మదిగా దగ్గినట్లు వినిపించింది. పరశురాముడు, విశ్వామిత్రుడు గతుక్కుమన్నారు. "ఏమయింది దేవ వైద్యా?" అడిగారు.

ధన్వంతరి సమాధానం చెప్పకుండా ఆ యంత్రాన్ని వాళ్ళిద్దరి ముందుంచాడు. వాళ్ళిద్దరూ ఆ యంత్రంలో నుంచి రైతును చూశారు.

ఒక మహా పర్వతం మాదిరి రైతు ఛాతీ మీద అంతులేని భారం. వారిద్దరూ అక్కడికి వస్తూ చూసిన నగరమంతా తిష్ఠ వేసింది. దానిలో దేవాలయాలు, విశ్వవిద్యాలయాలు, క్రీడాస్థలాలు, ఉద్యానాలు, కార్యాలయాలు, కర్మాగారాలు, ప్రభుత్వ భవనాలు ఇంకా ఎన్నెన్నో రైతు గుండెపై నిలిచి గర్వంతో తలలెగరేస్తున్నాయి.

"మహా ఘోరం! ఈ నిర్భాగ్యజీవి ఈ పేద రైతు తన గుండెపై ఇంత బరువు మోపినా ఇంకా బ్రతికి వుండడం చాలా ఆశ్చర్యంగా వుంది. గోవర్ధన పర్వతాన్ని మోసిన శ్రీకృష్ణుడైనా సరే ఇంత బరువు వేస్తే నుగ్గునుగ్గు కాకమానడు" పరశురాముడు తన అభిప్రాయం ప్రకటించాడు.

విశ్వామిత్రుడు కోపంతో పళ్ళు పటపట లాడించాడు. "పరశురామా! సమానత్వ సాధనకోసం ఆనాడు నువ్వు క్షత్రియ కుల సంహారం చేశావుగదా! నీ కృషి వృథా అయింది" అన్నాడు.

"విశ్వామిత్రా! అంతరాలు తొలగించడానికి నువ్వు కూడా ప్రయత్నించావుగదా! నీ శ్రమ ఫలించలేదు" పరశురాముడు తన మనస్సులోని మాట బయట పెట్టాడు.

ధన్వంతరివైపు తిరిగి "చెప్పు ధన్వంతరీ త్వరగా చెప్పు!! ఈ రైతుబాధ తొలగించాలంటే ఏమి చేయాలి?" అని అడిగాడు.

"రైతుపై మోపిన ధనస్వామ్య సామ్రాజ్య భారం తొలగించినట్లయితే రైతు బాధనుంచి విముక్తుడవుతాడు" ధన్వంతరి సూచించాడు.

"అప్పుడు దేశం అల్లకల్లోలమవదా?" పరశురాముడు సందేహం వెలిబుచ్చాడు.

ఈ ప్రశ్న ధన్వంతరికి నచ్చలేదు. కళ్ళు నిప్పుకణికలయ్యాయి. "ఇది అర్థంలేని మాట. ముందు దేశానికి వెన్నెముకైన ఈ రైతు తన బాధ నుంచి బయటపడాలి. అప్పుడు అతను బలం చేకూర్చుకుంటాడు. తన మీద తిరిగి ఎవరినీ అనంత భారం మోపనివ్వడు. తన దేశ పాలనాబాధ్యత తానే వహిస్తాడు" అని కచ్చితంగా చెప్పాడు.

వెంటనే విశ్వామిత్రుడు గంభీరనాదం చేశాడు. మరుక్షణం విప్లవశక్తులు ఉగ్ర రూపంతో ప్రత్యక్షమై ముకుళిత హస్తాలతో ఆజ్ఞ కోసం నిరీక్షించాయి.

"రైతు గుండెపై వున్న అనంత భారాన్ని లాగివేయండి," విశ్వామిత్రుడు భీకర స్వరంతో ఆదేశించాడు.

తక్షణమే గాలివాన, ఉరుములు, మెరుపులు, భూకంపం సంభవించాయి. ధనస్వామ్య సామ్రాజ్య భవనాలు కూలిపోయాయి.

రైతులో మూలుగు క్రమ క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఊపిరి మామూలుగా తీసుకోగలుగుతున్నాడు. అతని కళ్ళు వెలుగుతో నిండాయి. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ లేచి నిల్చున్నాడు. ముఖంలో చిరునవ్వు చెంగలించింది. విశ్వామిత్రుడికి, పరశురాముడికి చేతులెత్తి నమస్కరించాడు •

## రచయితలకు సూచనలు!

- మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
- జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
- మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
- అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
- మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
- ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
- రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
- ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.
- మీ రచనలు పంపించవలసిన చిరునామా:

ఆదివారం వార్త
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక
లోయర్ ట్యాంక్‌బండ్
హైదరాబాద్ – 500 080